"బ్రదుకులేమో భగ్నమైనా - ప్రణయమైనా నిలిచియుంటే -
మాయభువిలో మణుగుటెదలకు శరత్తున్నది రానెరావు!"

# మిగిలింది జ్ఞాపక మొక్కటే

(క థా ని క)

ఆ వూరు నేను రానంటే, బలవంతాన ఆర్జెంటు కేసు అని చెప్పి సత్యం తీసుకు వెళ్లాడు. ఏ వూరినైతే చూడనని నిశ్చయించుకున్నానో అదే వూరికి రావడం ఇదే మొదటిసారి. ఆ వూరును తలచుకున్నప్పుడల్లా హృదయంలో కలత, విచారం, బాధ అన్నీ కలుగుతూంటాయి. జీవితమంటే నిరాశపుట్టుతుంది. అంచేతనే ఆ వూరు పేరు తల చడమంటే ఏమిటోగా వుంటుంది.

సాయంకాలం నాదారిని నేను తలవంచుకుని పోతున్నాను. ఏదో ఆలోచిస్తున్నా. కంఠంవరకూ ఏదోవచ్చి అడ్డుపడి మాట్లాడ నివ్వకుండా చేస్తోంది. ఆ రోడ్డుమీదనే నా బాల్యంనుంచీ రంగదాసు పువ్వులమ్ముకుంటుండేవాడు. ఇప్పుడూ వున్నాడు. నేను కనపడగానే ఒళ్లో కూర్చున్న పిల్లను క్రిందకూర్చోపెట్టి ఎదురొచ్చి వినయంతో నమస్కారం చేశాడు.

"ఏం? రంగదాసూ, కులాసా" అని ప్రశించాను.

"తమ దయవల్ల..."

"అప్పటికీ ఇప్పటికీ ఒకేలా గున్నావు!"

"ఆ, ఏమిటో బాబు."

"ఐతే ఆపిల్ల ఎవరేమిటి, అలా ముద్దు లాడుతున్నావు?" రంగదాసు కొంచెం కంగారు పడ్డాడు. గుటకలు మింగాడు. అతని అవస్థను గ్రహించాను. అతనివీపు తట్టి "ఏం, యెందుకు అలా కంగారుపడుతావు, ఆ అమ్మాయి ఎవరో చెప్పటానికి" అన్నాను.

"ఏంలేదు, ఆ అమ్మాయి మన సరోజమ్మగారమ్మాయి."

సరోజిని! సరోజిని! అవును. ఆమె పేరు చెప్పుతుంటేనే, వింటుంటేనే నాలో ఏదో బాధ కలుగుతుంది. మళ్ళీ ఆపేరు నన్నుస్మృతుణ్ణి చేస్తుంది. చకితుణ్ణయ్యాను. ఒకసారి రంగదాసువంక చూశాను. నా హృదయంలో ఏదో కలత లేవదీశాననే తలంపుతో విచారంతో బాధపడుతూ తల వంచుకున్నాడు. నా జీవిత విశేషాలు, కష్ట సుఖాలు అతనికి తెలిసినట్లు ఈ జగత్తులో మరెవ్వరికీనీ తెలియదు. అందుచేతనే నామీద సానుభూతి, ఆ మమకారం చూపించడం.

మళ్ళీ ఆమెపేరు చెప్పి నన్ను బాధ పెట్టకుండా వుండటానికి ప్రయత్నించాడు, కాని మైమరపులో చటుక్కున అనేశాడు. తర్వాత తనూ బాధ పడ్డాడు చెప్పానని. రంగదాసుని చూస్తుంటే జాలివేసింది. అక్కడే చతికిల బడ్డాను.

పాపను ఒళ్లోకి తీసుకున్నా. ఆ పాప నాదేనని మళ్లీ మమకారం, గర్వం నాలో రేకెత్తుతున్నాయి. కాని ఆ పాప మరొకరి చేతిలోకి పోయిందనే బాధ నన్ను పీడించుకు తింటోంది.

పాప నావంక చూస్తోంది. నేనూ పాప వంక చూస్తున్నా. మెరిసే నా పాప చిన్ని కళ్లల్లో నాకు సరోజిని ఇవ్వలేని శాంతి, ప్రేమ, జాలి కనపరుస్తోంది. దగ్గరకు వచ్చింది. చిన్న వేళ్లను వుంగరాల జుట్టులోకి పోనిచ్చి చేతిలో వున్న గులాబీపువ్వు పెట్టమంది. ఆవేశాన్ని భరించలేక గట్టిగా తనివితీరా కౌగిలించుకున్నా. కాని నాబాధ బాధగానే వుంది. ఒడిలో కూర్చుంది. తల నిమురుతున్నాను. "పాపా" అన్నా ఆ పసిదాని కళ్లల్లోకి చూస్తూ.

పాప, నా మెడలోని స్టెతస్కోపుతో ఆటలాడుకుంటోంది. రంగదాసు పువ్వుల అంగడికెదురుగానే సరోజినిఇల్లు. చూస్తూ కూర్చున్నా.

* * *

మేము పుట్టకముందునుంచీకూడా మానాన్న, సరోజిని తల్లితండ్రులూ, అందరూ ఒకే ఇంట్లో

"మ రా మ"

వుండేవారు. అప్పట్లో నాన్నంటే ఆ యింట్లో వాళ్లు ఎంతో అభిమానంగా వుండేవారు. రెండూ ఒకటే కుటుంబం మాదిరిగా వుండేవి.

మేమిద్దరం ఈ ప్రపంచంలోకి వచ్చాక మా ఆటలు పాటలు చూచి ఎంతో మెచ్చుకునే వారు. ఆనందించేవారు. మా యిద్దర్నీ బయట బడిలోకి పంపించకుండా ఒక పంతుల్ని ఏర్పాటు చేయించి చదువు చెప్పించారు. బాల్యపుదినాల్లో పొందిన ఆనందం, రేకెత్తిన ఆశలు, భావాలు ప్రతిజీవీ ఎన్నడూ మరిచిపోలేడు.

ఆనాడు మేమిద్దరం స్వేచ్ఛాపక్షుల్లా తిరిగే వాళ్లం. నాకంటే సరోజిని చిన్నది. నే నేంచెప్పినా మారుమాట్లాడకుండా చేసేది. నా ఆనందం కోసం ప్రతిపనీ చేసేది. నా ఆనందంకోసం ఆటలు ఆడేది పాటలు పాడేది. అదీకాకుండా అన్నిటి కంటే, మరిచిపోవరానిది ఒకటే... అదే ఆమె అమాయకత్వం. అందుచేతనే ఆమె అంటే నా కెంతో అభిమానం, ప్రేమ. ఆమె సౌందర్యం, మానవుని వుక్కిరిబిక్కిరి చేసే ఆమె మెరిసే నేత్రాలసొంపు, నాలో ఆశలు రేకెత్తించేవి.

"సరూ, నిజంగా నువ్వెంత అదృష్టవంతు రాలివే! నిన్నేరాజు దరికి చేర్చుకుంటాడో కాని .." అంటూ ఆమెకళ్ళలోకి చూస్తుండేవాణ్ణి.

"ఎంతబాగా మాట్లాడావు రాజూ" అంటూ నా వుంగరాల జుట్టులోకి వ్రేళ్లను పోనిస్తూ చిన్నగా నవ్వుతూండేది.

బాల్యం గడిచిపోయింది. యౌవన రేఖలు ఉద్భవిస్తున్నాయి. యౌవనం ఉదయిస్తున్నకొలది ప్రేమలో సంఘం ఎడబాటు కల్పిస్తుంది. ఇది వరకున్న స్వేచ్ఛ, ఆశలు ఈనాడు నాలో చంపుకోవాల్సి వస్తున్నది. సరోజిని పెద్దదయే కొలదీ ఇంట్లోవాళ్లు ఆమెను బయటకు రానివ్వ డం లేదు. తరచుగా ఎవరికీ కనబడనివ్వడం లేదు. ఎవరితోనూ మాట్లాడనివ్వడం లేదు. నాలో ఆవేదన, ఆవేదనలో ఆవేశం, ఆవేశంలో సంఘంమీద వుక్రోషం... కాని నేనేం చెయ్యగలను!

* * *

ఆవేళ ఆమెతో తుదినిర్ణయం చేసుకోవా లనుకున్నా. సాయంత్రం రంగదాసు దగ్గరకు వెళ్ళాను. పువ్వులదండ ఇమ్మన్నాను. రంగదాసు చిన్నప్పట్నించీ నన్నెఱుగును. ఎప్పుడూ ఆతని పువ్వుల అంగడి చుట్టూ ఆడుకొంటూ కిల కిల నవ్వుకొంటూ పరుగెత్తుతూవుంటే మమ్మల్ని చూసి మురిసిపోతుండేవాడు.

రంగదాసు పువ్వులదండ ఇవ్వలేకపోయాడు. మంచి గులాబీపుష్పాన్నిచ్చాడు.

సాయంకాలం గడిచిపోయింది. వెన్నెల రాత్రులవి. మెల్లగా చంద్రుడు తన చల్లని తెల్లని కాంతుల్ని వెదజల్లుతూ వస్తున్నాడు. ఏవో తెలియని శక్తులు నన్ను వుద్రేకపరుస్తు న్నాయి ఇంట్లోవాళ్ళంతా ఎక్కడికో పేరం టానికి వెళ్ళిపోయారు. సరోజిని మాత్రం ఒక్కతే దొడ్లో దానిమ్మచెట్టు క్రింద మంచం మీద ఒంటరిగా పడుకొని ఉదయిస్తున్న చంద్రునివంక చూస్తూ కూనిరాగాలు తీస్తున్నది. ఆమెను చూడటంతోనే నా హృదయం ఆరా టానికి గురిఅయింది. కన్నులు మూశా. సరోజిని భయంతో లేచికూర్చున్నది. సిగ్గుతో రోషంతో తలవంచుకుంది.

'సరూ! నా సరూ, ఎన్నాళ్ళకు మళ్ళీ మనం స్వేచ్ఛగా కలుసుకున్నాం' అంటూ మంచం పట్టెమీద కూర్చున్నా. సరోజిని నావంక కోపంతో తీక్షణంగా చూస్తోంది. ఆమె కోపం గుర్తించాను. నా మనస్సు చిన్నబోయింది. నా చేతిలోని గులాబీ జేబులోకి పోయింది.

"అలా ప్రవర్తిస్తా రెందుకు" అందితీక్షణంగా.

"నేనేం తప్పుపని చేశాను సరోజినీ."

"తప్పో ఒప్పో తెలియకుండా ప్రవర్తించ డం భావ్యంగా లేదు." ఆమాటలే నన్ను దెబ్బ పొడిచినట్టనిపించాయి. నా ఆశలన్నీ అడుగంట చేస్తున్నట్టున్నాయి. బరువెక్కిన హృదయంతో, నిరాశా దృష్టితో ఆమెవంక చూశాను. ఆమె హృదయం కరిగింది. నన్ను జాలిగా చూసింది. నేను లేచి వెళ్ళిపోయాను. సరోజిని ముందుకు వచ్చి నిలబడి—

"అంతలో అలా కోపగించుకుంటే ఎలా?" అంటూ నావంక ఓరగా చూస్తూ నా చొక్కా గుండీల్ని సర్దుతోంది.

"సరూ! నే నెవర్నయితే నా హృదయంలో దేవతగా తలచి పూజించానో ఆమె నన్ను చిన్న బుచ్చితే..."

"అలా అనకండి" అంటూ మంచంవరకూ తీసుకువెళ్ళి కూర్చోపెట్టింది. తను క్రింద కూర్చుంది. గులాబీ తీసి ఆమెచేతి కిచ్చాను. ఆమె నావంక ఒకసారి అర్థనిమీలిత నేత్రాలతో చూచి హృదయంలో భారమంతా పోయిన దానిలా నిట్టూర్పువిడిచి నాఒడిలో తలపెట్టుకొని కన్నీరు కార్చింది. పరుల హృదయాన్ని అర్థంచేసుకునే శక్తి నాలో లేదేమని.

"జీవితకాలం నువ్వు నాదానివే" అన్నా.

"కాదని ఎవరన్నా"రంది.

అవే ఇప్పుడుకూడా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి "అవును సరూ! నాదానివే. నాసరుని తీసుకోవడానికి ఈ విశ్వంలో ఎవరికీ అధికారంలేదు. నువ్వేనా గులాబీ, ప్రేమిస్తా, ఆస్వాదిస్తా."

"సరూ ఇప్పటికీ నాసొత్తే" అంటోంది ఇంకా నాహృదయం.

"కాదని ఎవరన్నారని ఏదో వాణి పలుకుతూన్నట్టుంది. ఎవరికీ తెలియకుండా వూరిబయట తోటల్లో ఎన్నోసార్లు వెన్నెల రాత్రుల్లో స్వేచ్ఛగా విహరించాం.ఆనందాన్ని కొల్లగొట్టాం. అప్పటికే ఇంటరు పూర్తిచేశాను డాక్టరు కోర్సుకు వైజాగ్ వెళ్ళాను. ఆరు నెలలకు సరోజిని దగ్గరనుంచి వుత్తరం వచ్చింది.

తన గర్భంచిహ్నాలు కనబడుతున్నాయని, మా యిద్దర్నీ అనుమానించారని, సంఘానికి భయపడి ఏమీ తెలియని మొద్దుని కట్టబెట్టి లోకాపవాదాన్నుంచి తప్పించుకోనడానికి తన తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారని. తనని ఈ సమయంలో రక్షించవలసినదని. ఆవేదనా హృదయంతో ప్రతిఒక్క అక్షరంలో తన ఆవేదనని జాలిని బాధను చూపిస్తూ వ్రాసింది. నా హృదయంలో తుఫాను చెలరేగింది. నాదగ్గర డబ్బులేదు. స్నేహితులదగ్గరకూడా లేదు. ఇంటిదగ్గరనుంచి తెప్పించి బయలుదేరాను. వారం రోజులకు ఇంటికి చేరుకున్నాను.

ఇల్లంతా చీకటిగావున్నట్టుగా వుంది. అవును ఇంట్లోని వెలుగురేఖ దూరమయ్యింది. అందరూ తలలువంచి కూర్చున్నారు. సరోజిని ఆవేదన నా హృదయంలో బాధగానేవుంది. సంఘానికి భయపడినాను కాపవాదాలు వస్తాయని మా ప్రేమలో శనంచేసి జీవితాల్ని భగ్నంచేసి మాయిద్దరిమధ్య పెద్దబండ అడ్డుపెట్టి నాసరూని దూరంగా పంపించివేశారు. ఏ ఒక్కరికీ మా మీద సానుభూతి లేకపోయింది. మానవ హృదయాలు గడ్డకట్టుకుపోయాయి. ఇంకా ఆ హృదయాలముందు రోదించి నాతల బగులగొట్టుకుని చచ్చినాకాని జాలి చూపించేవాళ్ళు లేరు. సరోజిని జీవితనాశన కారకుణ్ణయ్యాననే బాధ నన్ను పిచ్చివాణ్ణిగా చేస్తోంది.

నా పాపపు ముఖాన్ని ఆమెకు చూపించి ఏం జవాబు చెప్పను? నా జీవితంలో నా ముఖాన్ని చూపించలేను! చూపించను. అదే ఆఖరిసారి. ఇక ఆవూరికి ముఖం చూపించకూడదని నిశ్చయించుకున్నా.

ఆవేదనా హృదయంతో కాలేజికి చేరుకున్నా. చదువు పూర్తిచేశాను. ఇక ఈ జీవితంలో పెండ్లి చేసుకోదలచుకోలేదు. ప్రాక్టీసు మొదలెట్టాను. బోర్డు కట్టాను.

* * *

"లేదు లేదు. దూరమవలేదు. నా సరూ నా హృదయంలో నా దేవతగా నిలిచేవుంది. ఆ వెలుగురేఖ నా జీవితాన్ని ముందుకు నడిపిస్తోంది, ఆమె నాదే. నాదే నా సొత్తే."

"కాదని ఎవరన్నారు!"

వులిక్కిపడ్డాను. ప్రక్క రంగదాసు నావంక చూస్తూ నిశ్చేష్టుడై నిలబడ్డాడు.

పాప స్టెతస్కోపులతో నా హృదయంలోని సంఘర్షణంతా వింటోంది.

పాపను హృదయానికి గట్టిగా అదుముకున్నా. నా హృదయంలో ఆ వేదనంతా నా పాపతో చెప్పుకొని ఏడ్చి, భారమంతా పోయినట్టుగా నిట్టూర్పువిడిచాను.

అదే సమయంలో ఎదురుగా ఇంట్లోంచి, "పాపా" అంటూ కేక వినబడింది. తిరిగిచూచా. సరోజిని. ఆమె అప్పటికీ ఇప్పటికీ చాలా చిక్కిపోయింది. చంకలో మరోపిల్లాడు. గుమ్మంలోంచి చూస్తోంది.

పాప లేచినిలబడింది. నా తలలోని గులాబీ పాపకిచ్చాను. గబగబా తల్లిదగ్గరకు పరుగెత్తింది.

సరోజినికి నా ముఖంచూపించదలుచుకోలేదు. అపచారం చేసిన వాడిలా గబగబా అక్కణ్ణుంచి నడకసాగించా.